
సాక్షి మెదక్

గురువారం । 23 । నవంబర్ । 2023



మిత్రమా రాత్రి కలుద్దాం..
పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు సాగిస్తూ అభ్యర్థులతోపాటు వారి అనుచరులు పడరాని పాట్లు పడుతున్నారు.
వివరాలు 10లో ▸



సర్వే రిపోర్ట్స్‌తో కేసీఆర్ నారాజ్
అన్ని సర్వే రిపోర్ట్స్ కాంగ్రెస్ వైపే ఉన్నాయని తెలిసి సీఎం కేసీఆర్ నారాజ్‌గా ఉన్నారని ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్ అన్నారు.
వివరాలు 10లో ▸



ఆటలు అట్టహాసంగా..
సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే గురుకులం వేదికగా నాలుగు రోజులపాటు కొనసాగే ఈ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.
వివరాలు 10లో ▸

న్యూస్‌రీల్

తిరిగి బీఆర్‌ఎస్ గూటికి



బీఆర్‌ఎస్ కండువా కప్పుతున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా యూత్ వింగ్ సోషల్ మీడియా నాయకుడు యాదోసు శివకుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన మరుసటి రోజే తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వచ్చారు. బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి ఆధ్వర్యంలో తిరిగి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వడంలేదని వాపోయారు. సీఎం కేసీఆర్ గెలుపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు మధురావు, మహేశ్‌గౌడ్, శ్రీకాంత్, సాయి, అరుణ్ తదితరులున్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద



మాట్లాడుతున్న లక్ష్మీశారద

మెదక్ కలెక్టరేట్: డిసెంబర్ 9న మెదక్ కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ లక్ష్మీశారద తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో మోటార్ వెహికల్ ఇన్సూరెన్సు స్టాండింగ్ కౌన్సిల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎక్కువ కేసులను పరిష్కరించే విధంగా న్యాయవాదులు సహకరించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని పూర్తిగా నివారించొచ్చు


జిల్లా పారా మెడికల్ అధికారి

కౌడిపల్లి(నర్సాపూర్): కుష్టువ్యాధిని మొదట్లోనే గుర్తించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని జిల్లా పారా మెడికల్ అధికారి వెంకటేశ్వరచారి సూచించారు. స్థానిక సీహెచ్‌సీని ఆయన రాష్ట్ర బృందం సభ్యులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కుష్టువ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలు, వ్యాధిగ్రస్థుల గుర్తింపుతో పాటు రోగులకు మందుల పంపిణీ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. కుష్టు వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందన్నారు. 2030 నాటికి కుష్టువ్యాధిని పూర్తిగా నివారించేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని, అధికారులు గ్రామాలలో ముమ్మరంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీఎంఓలు శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, జాఫర్, డీఎస్ ఓ సురేందర్, ఏపీఎంఓ జోసెఫ్, డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, ఫర్హాజ్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

గజ్వేల్‌రూరల్: ఉమ్మడి మెదక్ జిల్లా పాలిటెక్నిక్ క్రీడాపోటీలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు.

కొమురవెల్లి పాత కమాన్ దారి మూసివేత



దారి మూసివేస్తున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే పాత కమాన్ దారి మూసివేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సిద్దిపేట నుంచి కొమురవెల్లి వచ్చే భక్తులు గౌరయపల్లి గుండా, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు తిమ్మారెడ్డిపల్లి కమాన్ మీదుగా కొమురవెల్లికి చేరుకోవాలని తెలిపారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

కేసీఆర్ చేతిలోనే తెలంగాణ భద్రం

- కోటి మందికి కేసీఆర్ ఉచిత బీమా
- అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు
- అన్ని చెరువులను గోదావరి నీటితో నింపుతాం
- జనవరిలో కొత్త రేషన్‌కార్డులు
- నార్సింగి సభలో మంత్రి హరీశ్‌రావు





నార్సింగిలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు.. ప్రచారరథంపై అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

రామాయంపేట(మెదక్): కేసీఆర్ చేతిలోనే తెలంగాణ భద్రంగా ఉంటుందని, ఇతరుల చేతుల్లోకి వెళితే ముప్పు వాటిల్లుతుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. నార్సింగిలో బుధవారం జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే కోటి కుటుంబాలకు కేసీఆర్ ఉచిత బీమా వర్తింపజేస్తామని, అలాగే అసైన్డ్ భూములు అమ్ముకునే విధంగా రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పిస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. రుణమాఫీ 75 శాతం పూర్తి కాగా, మిగిలింది కూడా త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గత ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో గెలిచి ప్రజలను మోసగించారని ఆరోపించారు. ఆయన గెలిచాక దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిలో మూడేళ్లు వెనుకకు పోయిందని వాపోయారు. తాము అధికారంలోకి రాగానే జనవరిలో కొత్త రేషన్ కార్డులతోపాటు పింఛన్లు ఇప్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వ్యవసాయ బోర్ల వద్ద మీటర్లు పెడతామని బీజేపీ వాళ్లు, మూడు గంటల విద్యుత్ సరిపోతుందని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారని, వారి మాటలు నమ్మవద్దని మంత్రి సూచించారు. నార్సింగి మండలంలో ఉన్న అన్ని చెరువులను గోదావరి నీటితో నింపుతామని, దున్నపోతుకు గడ్డేసి, బర్రెకు పాలు పిండొద్దని ఆయన సూచించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎలాగైనా గెలుపొందాలనే ఆరాటంతో అధిక మొత్తంలో డబ్బులు వెదజల్లుతున్నారని, ప్రజలు దానికి ప్రలోభపడవద్దని కోరారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ ప్రకటించిందని, తొమ్మిదేళ్లలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. నరేంద్రమోదీ ప్రభుత్వం యువతను మోసగించిందని ఆరోపించారు. ఓటంటే నాలుగేళ్ల ముచ్చట కాదని, ఐదేళ్ల మన భవిష్యత్తని మంత్రి పేర్కొన్నారు. అనంతరం దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాగైనా తనను పోటీలోనుంచి తప్పించడానికే తనపై ప్రతిపక్షాలు హత్యాయత్నానికి ఒడిగట్టాయని ఆరోపించారు. అనంతరం నార్సింగి పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రచార రథంలో ర్యాలీని అనుసరించారు. నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పవన్ కల్యాణ్ రోడ్‌షో

చేగుంట(తూప్రాన్): చేగుంటలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం రోడ్‌షో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు భూపాల్ తెలిపారు. పవన్ రాక కోసం రుక్మాపూర్ శివారులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను బీజేపీ నాయకులు బుధవారం పరిశీలించారు. అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా నిర్వహిస్తున్న రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం కలెక్టరెట్‌లో పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 30న పోలింగ్ ఉన్నందున జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. మైక్రో అబ్జర్వర్‌లు పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ వంటి సదుపాయాల గురించి పరిశీలించాలని ఆదేశించారు. అదే విధంగా పోలింగ్ నిర్వహణ, ఈవీఎం, వీవీప్యాట్, ఏజెంట్‌ల నియామక, ఇంక్, ఫామ్ 17 నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్, మాక్ పోలింగ్, ఇంటి నుంచి ఓటు వేయడం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అసాంఘిక ఘటనలు చోటు లేకుండా చూడాలని కోరారు. ఎన్నికలకు ముందు ఎన్నికల అనంతరం మైక్రో అబ్జర్వర్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ రోజు చేయాల్సిన విధుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో రాజర్షిషా వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నాగాపూర్ వీఓఏ తొలగింపు

- ఎన్నికల విధులలో నిర్లక్ష్యం

మెదక్ కలెక్టరేట్: హవేళిఘణాపూర్ మండలం నాగాపూర్ వీఓఏ యాదగిరి ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించడంతో అతడిని తొలగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాపూర్ గ్రామ ప్రతినిధులు ఎన్నికల పరిశీలకుడు పృథ్వీరాజ్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల విధులను విస్మరించి గ్రామ మహిళ సంఘాలను మభ్యపెడుతూ సౌభాగ్య లక్ష్మి పథకం కింద రూ.3 వేలు ప్రభుత్వం నుంచి వస్తాయని ప్రచారం చేశారని ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ, ఏపీఎం, సీసీ, పంచాయతీ కార్యదర్శి, ఎఫ్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ అందరి సమక్షంలో విచారించారు. ఆధారాలు పరిశీలించగా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలిందని అందుకే అతడిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.

ప్రలోభాలకు గురికావద్దు

జిల్లా సంక్షేమ అధికారిణి బ్రహ్మాజీ



ప్రతిజ్ఞచేయిస్తున్న బ్రహ్మాజీ తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓటరు తన విలువైన ఓటును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె చిలప్‌చెడ్‌లో ఓటు ప్రాముఖ్యత, దాని వినియోగంపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటును సద్వినియోగం చేసుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తన విలువైన ఓటును వినియోగించుకోవాలని సూచించారు. డబ్బు, బహుమతులు, మద్యం వంటి ప్రలోభాలకు గురై, ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు అన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి, ఎంపీడీఓ శశిప్రభ, ఏపీఓ ప్రేమలత, గ్రామ మహిళలు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం భుజిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని జిల్లా సంక్షేమ అధికారిణి బ్రహ్మాజీ అన్నారు. బుధవారం ఆమె స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న భోజనం, పాలు, గుడ్లు, బాలామృతం తదితర వాటిని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు పౌష్టికాహారం తినిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోషిమాత, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆర్‌నే సీఎం చేయాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గంగాధరరావు



మాట్లాడుతున్న గంగాధరరావు

చిన్నశంకరంపేట(మెదక్): మూడోసారి కూడా కేసీఆర్‌ను సీఎం చేసేందుకు ప్రజలు బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏకే గంగాధరరావు కోరారు. బుధవారం చిన్నశంకరంపేటతో పాటు ధరిపల్లి, గవ్వలపల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్మొద్దని, గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని అందుకే మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్‌తోనే రైతులకు కూడా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆర్.అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, రాధాకిషన్‌రావు, రమేశ్‌రావు, పూర్ణచందరరావు, మున్యా నాయక్, వెంకటేశం పాల్గొన్నారు.

వర్షాకాలం ఉసిళ్లు.. ఎన్నికల్లో విజయశాంతి

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మ


మెదక్: వర్షాకాలం వస్తే ఉసిళ్లు ఏ విధంగా వస్తాయో ఎన్నికలు వస్తే విజయశాంతి అదేవిధంగా వస్తుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక వెంకటేశ్వర గార్డెన్‌లో బుధవారం గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడుతూ మాజీ ఎంపీ విజయశాంతికి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావుకు ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే పదవులు వచ్చాయని మర్చిపోవద్దన్నారు. తన కొడుకు టిక్కెట్ ఇవ్వకపోవడం వల్ల మైనంపల్లి హనుమంతరావు స్వార్థ రాజకీయాల కోసం బీఆర్‌ఎస్‌ను విమర్శిస్తున్నారని ఆరోపించారు. 11 సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజల కష్టాలు తెలుసని, కష్టాలు ఉన్నచోట క్షేమ పథకం ఉంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి బాటలో నడవాలంటే తిరిగి కేసీఆర్ ప్రభుత్వం రావాలని అందుకు భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ వల్లే గిరిజనుల అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ హయాంలో గిరిజనులు తీవ్ర నిరాధరణకు గురయ్యాని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వాసు నాయక్, జాతీయ కార్యవర్గ సభ్యుడు కిషన్ నాయక్, రాష్ట్ర సంఘ బాధ్యులు వసంత్ నాయక్, రమేశ్ నాయక్, బాలాజీ నాయక్, శ్రావణ్ నాయక్, సాయి నాయక్, మెదక్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, జిల్లా సంఘ బాధ్యులు రంజిత్ నాయక్, బాబా నాయక్, ప్రేమ్ నాయక్, ఫుల్ సింగ్ నాయక్, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు రాగి అశోక్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివ్వాయిపల్లి గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపుకోసం మండలంలోని శివ్వాయిపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని బుధవారం పద్మాదేవేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి కిష్టయ్య, మున్నూరు కాపు సభ్యులు దూసల నర్సింలు, తోట్ల రాములు, కొత్తపల్లి బాలేశ్, ఆకుల సత్తయ్య, కొత్తపల్లి నరేందర్, కొత్తపల్లి ప్రభాకర్, కొత్తపల్లి రాజు, కొత్తపల్లి రవి, తోట్ల విట్టల్, తోట్ల మల్లేశం, దూసల సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమయంలేదు మిత్రమా..

- ప్రచారానికి ఇంకా ఐదురోజులే..
- జిల్లాకు రానున్న అగ్రనేతలు
- వ్యూహాత్మకంగా అభ్యర్థుల అడుగులు
- గంపగుత్త ఓట్లకోసం హామీలు



మెదక్: రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా ఏడు రోజులే గడువు ఉంది. అయితే 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేయాలి దీంతో ఇంకా మిగిలింది ఐదు రోజులు మాత్రమే. అంటే బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచారానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకూ ఒక ఎత్తు కాగా ఈ ఐదు రోజుల మరో ఎత్తుగా అభ్యర్థులు భావిస్తున్నారు. అందులో భాగంగా వారు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా విజయం కోసం ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఎక్కడెక్కడ బలహీనత ఉంది దానిని ఎలా పరిష్కరించుకోవాలి, ఎక్కడ ఎవరిని తమ పార్టీలో చేర్చుకోవాలి అనే పథకాలు రచించి అమలు చేస్తున్నారు. ప్రత్యర్థుల వ్యూహాలను దెబ్బతీస్తూ విజయాన్ని సాధించేలా ప్రతి వ్యూహాలు కూడా రూపొందిస్తున్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా దూసుకెళ్తున్నాయి. ఈ చివరి వారంలో భారీ సభల నిర్వహణకు కూడా ప్లాన్ చేసుకుంటున్నాయి.

ఈ ఐదురోజులు చాలా కీలకం

ఎన్నికల పర్వంలో కీలకమైన ప్రచార ఘట్టానికి కేవలం ఐదు రోజులు మాత్రమే మిగిలింది. ప్రచారానికి 28 సాయంత్రం 5 గంటలకు గడువు పూర్తవుతుంది. ఈ క్రమంలో జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజక వర్గాల్లో మూడు ప్రధాన పార్టీలు తమ జోరును పెంచాయి. కొంత మంది అభ్యర్థులు ఈ ఐదు రోజులు చాలా కీలకంగా వ్యవహరించాలని పథకం రచించారు. ఏరోజు ఏం చేయాలి. ఎవరు ఏ బాధ్యత చేపట్టాలనే కార్యక్రమాల గురించి పక్కాగా నిర్ణయించుకున్నారు. ఆయా రోజుల్లో చేయాల్సిన పనులను వాట్సప్ ద్వారా తమ అనుచరులకు పంపిస్తున్నారు. ప్రధానంగా బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రచారాన్ని పదునెక్కించే దిశగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ తాము బలహీనంగా ఉన్నామనే సమాచారాన్ని ఇప్పటికే ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బృందాల ద్వారా తెలుసుకున్న అభ్యర్థులు వాటిపై దృష్టిపెట్టారు. ఈ ఐదురోజుల్లో ఎంతగా ప్రజల్లోకి వెళ్తే.. ఏ మేరకు ఓటర్లను ఆకట్టుకోగలిగితే అంతగా విజయావకాశాలు పెరుగుతాయని అభ్యర్థులు భావిస్తున్నారు. ప్రతిక్షణం జనంతోనే ఉంటున్నారు.

గంపగుత్త ఓట్ల కోసం

మెదక్ జిల్లాలోని నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారానికి ఐదు రోజులు మిగలడంతో ఒకేసారి గంపగుత్తగా వందల మంది ఓటర్లను తమవైపు ఎలా తిప్పుకోవాలనే వ్యూహాలను రచిస్తున్నారు. అందులో భాగంగా ఉపాధ్యాయ, ఉద్యోగ, వైద్యులు, యువజన సంఘాలు, వివిధ కమిటీలతో చర్చలు నిర్వహిస్తున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా కులసంఘాలకు ఆలయాలు, కమ్యూనిటీ భవనాలకు నిధులు సమకూరుస్తామనే హామీలు గుప్పిస్తున్నట్టు సమాచారం. అభ్యర్థులు ప్రచారంలో పాల్గొంటుండగా, వారి అనుచరులు, నాయకులు గంపగుత్త ఓటర్ల కోసం జోరుగా చర్చలు సాగిస్తున్నారని, వారికి కావాల్సినవి సమకూర్చుతూ తమవైపు తిప్పుకునేందుకు శ్రమిస్తున్నట్టు పలువురు చెప్పుకుంటున్నారు.

పోటా పోటీ.. మీటింగ్‌లు

రెండు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే మెదక్, నర్సాపూర్ ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అలాగే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే మెదక్‌లో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో పాల్గొని తమ మెదక్, నర్సాపూర్ అభ్యర్థులు డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు, రాజిరెడ్డిని గెలిపించాలని కోరారు. అలాగే నర్సాపూర్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం మెదక్ ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎంపీ విజయశాంతి, మైనంపల్లి హన్మంతరావు తమ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అలాగే బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధాని మోదీ పాల్గొంటారని ఆ పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, లేదా ప్రియాంక గాంధీలు సైతం మెదక్, నర్సాపూర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ నాయకులు కూడా చెబుతున్నారు.

సునీతారెడ్డి ఎన్నికల ప్రచారంలో జర్మన్ బృందం

కొల్చారం(నర్సాపూర్): నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొల్చారం మండలం కోనాపూర్‌లో బుధవారం జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో జర్మనీకి చెందిన పొలిటికల్ మినిస్టర్ ఆఫ్ కౌన్సిలర్ మారియస్ ఓస్వాల్డ్, ఆదేశ ఎంబసీ బృందం సభ్యుడు సందీప్ ఏటూరి పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. వారు ఇక్కడ జరుగుతున్న ఎన్నికల ప్రచారాన్ని తెలుసుకోడానికి వచ్చినట్టు తెలిపారు. అందులో భాగంగా వివిధ చోట్ల నిర్వహిస్తున్న ప్రచార ప్రక్రియను పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ బృందం సభ్యులు ప్రచారంలో పాల్గొని నాయకులు, కార్యకర్తలతో నృత్యాలు చేశారు.



ప్రచారంలో పాల్గొన్న జర్మనీ బృందం సభ్యులు

క్లుప్తంగా

రూ.1.01 లక్షలు సీజ్‌

వర్గల్‌(గజ్వేల్‌): ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 1,01,000 నగదును ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని సీజ్‌ చేసినట్లు వర్గల్‌ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్‌ తెలిపారు. బుధవారం గౌరారం వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అశోక్‌ లేలాండ్‌ ట్రాలీ ఆటోలో వ్యక్తి వద్ద నగదు గుర్తించామన్నారు. సీజ్‌చేసిన నగదు వర్గల్‌ ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌కు అందజేశామన్నారు.

కేసీఆర్‌కే మా ఓటు..

తీర్మాన ప్రతులు హరీశ్‌రావుకు అందజేత



తీర్మాన ప్రతులు మంత్రి హరీశ్‌రావుకు అందిస్తున్న సభ్యులు

కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లి మండలంలోని ఆర్‌ఎంపీల సంఘం సభ్యులు, రాయవరం గ్రామంలో హమాలీ సంఘం సభ్యులు ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ దేవి రవీందర్‌ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కే మా ఓటంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనికి సంబంధించిన ప్రతులను బుధవారం మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు. కుకునూరుపల్లి మండల ఏర్పాటు 30 ఏళ్ల కలను సాకారం చేసినందుకు గ్రామాల్లో ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా ఆర్‌ఎంపీలకు సహకరిస్తున్నందుకు కేసీఆర్‌కు ఓటు ద్వారా రుణం తీర్చుకుంటామంటూ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పావణి, కొండపోచమ్మ దేవాలయ డైరెక్టర్‌ లక్ష్మణ్‌రాజు, ఆర్‌ఎంపీలు సుదర్శన్‌, లగిశెట్టి కనకయ్య పాల్గొన్నారు.

మిత్రమా రాత్రి కలుద్దాం..

పగలు ప్రచారం.. రాత్రి వ్యూహం
- ప్రణాళికతో ముందుకెళ్తున్న అభ్యర్థులు
- సామాజికవర్గాల వారీగా సమావేశాలు
- కులపెద్దలతో మంతనాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు పడరాని పాట్లు



జంగ్ తెలంగాణ

జోగిపేట (అందోల్‌) : ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ముమ్మరవుతోంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇందులో భాగంగా అనుచరుల్లోని ముఖ్యులను రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యతిస్తున్నారు. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి ముందస్తుగా హామీలు ఇచ్చి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు సాగిస్తూ అభ్యర్థులతోపాటు వారి అనుచరులు పడరాని పాట్లు పడతున్నారు. అన్ని సామాజిక వర్గాల మద్దతు లభిస్తే విజయం సునాయాసమన్న భావనలో అభ్యర్థులున్నారు. కుల సంఘాల వారీగా ఓటర్లను గుర్తించేందుకు ప్రత్యేకంగా టీమ్‌ను తయారు చేసుకొని తీసివేతలు, కూడికలు మొదలుపెట్టారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లి ఓట్లు అడిగే సమయం లేదు. దీంతో ప్రధాన గ్రామాలపై దృష్టి సారించిన నేతలు పగలు ప్రచారం చేస్తూ రాత్రి వేళ మంతనాలు చేస్తున్నారు.

కులపెద్దలతో మంతనాలు

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో మంతనాలు చేస్తున్నారు. ప్రతిరోజూ సమయం దొరికినప్పుడల్లా ఫోన్లలో వారిని ఆప్యాయంగా పలుకరించి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారితో ప్రస్తావించి గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. ప్రతీ ఎన్నికల్లో కొన్ని సామాజికవర్గాలు అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తున్నాయి. అలాంటి సామాజికవర్గాన్ని గ్రామాల వారీగా గుర్తించేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళిక రూపొందించుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజికవర్గాన్ని గుర్తించి వారి మద్దతును తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు. నియోజకవర్గంలో 40 నుంచి 45శాతం ఓటర్ల మద్దతును కూడగట్టుకుంటే విజయం తథ్యమనే భావన అభ్యర్థుల్లో నెలకొంది.

రెండు వైపులా వారే...

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరిని నమ్మాలో..? ఎవరిని దూరంగా ఉంచాలో అర్థం కాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం ఓ అభ్యర్థి ప్రచారంలో కనిపిస్తున్న వ్యక్తులు చీకటి కాగానే మరో అభ్యర్థి శిబిరంలో చేరిపోతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని నమ్మబలుకుతున్నారు. మందు, విందు పార్టీల్లో మునిగి తేలుతున్నారు. ఒక్కరుగా వెళ్లకుండా కొంత మందిని పోగేసుకొని వెళ్తున్నారు. వీరిని బుజ్జగించడానికి అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. మరికొందరు ఇప్పటికే ఫిరాయింపులకు పాల్పడి చేరిన పక్షం వైపు చక్రం తిప్పుతున్నారు.

ఎన్నికల సిత్రాలు

చకాచకా కత్తిరిస్తా.. ఓటు పట్టేస్తా..



మంత్రి హరీశ్‌ రావుకు మద్దతుగా సిద్దిపేట మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ మంజుల బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లక్షన్నర మెజార్టీ లక్ష్యంగా ప్రతీ ఒక్కరినీ ఓట్లు అడుగుతున్నారు. స్థానిక భారత్‌నగర్‌లో ఒక దర్జీ షాపులో బట్టలను కొలత మేరకు కత్తిరించి, పనిలో పనిగా ఓట్లు అడిగారు.
– సిద్దిపేటజోన్‌

ముద్ద పెట్టుకో.. గుర్తు పెట్టుకో..



చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బుధవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ మంగోలు చంటి. ఇందులో భాగంగా ఓ వృద్ధుడికి చెంచాతో అన్నం తినిపిస్తూ ఓటు అభ్యర్థించాడు. ఆయన వెంట స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు పలువురు ఉన్నారు.

అభిమానానికి నిలువెత్తు ఆదారం

సిద్దిపేటకు చెందిన ముగ్గురు యువకులు రెండు వారాలు శ్రమించి దాదాపు 6 కిలోమీటర్ల పొడవైన దారంతో, 4 వేల మలుపులతో, ఆరు మీటర్ల ఎత్తు, ఆరు మీటర్ల పొడవునా థ్రెడ్‌ ఉపయోగించి మంత్రి హరీశ్‌రావు బొమ్మ రూపకల్పన చేశారు. బుధవారం మంత్రి నివాసంలో ఆర్ట్‌ బొమ్మను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువకులు వినయ్‌, బాలాజీ, సంతోష్‌ను హరీశ్‌రావు అభినందించారు.
– సిద్దిపేటజోన్‌



అభివృద్ధిని అడ్డుకోవడమే వారి పని

- ఇక్కడ పరిశ్రమలు రాకుండా చేసింది కాంగ్రెస్‌ నాయకులే..
- ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన నిరుద్యోగులు
- అందోల్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌ విమర్శలు



ప్రచారంలో మాట్లాడుతున్న క్రాంతికిరణ్‌

మునిపల్లి(అందోల్‌): అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక పనులను అడ్డుకోవడమే కాంగ్రెస్‌ పనిగా పెట్టుకుందని అందోల్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌ మండిపడ్డారు. బుధవారం మండలంలోని పెద్దలోడి, లింగంపల్లి, కంకోల్‌, బోడపల్లి, తక్కడపల్లి, ఖమ్మంపల్లి, మునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో క్రాంతికిరణ్‌కు మంగళహారతులు ఇచ్చి మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్‌ మాట్లాడుతూ.. ఇక్కడి నిరుద్యోగ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్‌ మునిపల్లి మండలం లింగంపల్లి, కంకోల్‌, మగ్దుంపల్లి గ్రామ శివారులో ఫుడ్‌ ప్రాసెసింగ్‌ పరిశ్రమను మంజూరు చేశారన్నారు. కోర్టులో కేసులు వేసి పరిశ్రమ ఏర్పాటు కాకుండా దామోదర రాజనర్సింహ అడ్డుకున్నారని దుయ్యబట్టారు. పరిశ్రమ ఏర్పాటై ఉంటే సుమారు 5,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవని ఆవేదన వ్యక్తం చేశారు. కారు గుర్తుకు మరోసారి ఓటేసి మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా, రెండోసారి నన్ను అందోల్‌ ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీనాక్షి, ఎంపీపీ శైలజా, ఎంపీపీ ఉపాధ్యక్షుడు ఖమ్రొద్దీన్‌, మాజీ జెడ్పీ చైర్మన్‌ బాలయ్య, మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు సాయికుమార్‌, విజయ్‌ కుమార్‌, శివశంకర్‌, శశికుమార్‌, వెంకటేశం, రాంచందర్‌రావు, నవాజ్‌రెడ్డి, మొగులయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

రాయికోడ్‌(అందోల్‌) : మండలంలోని కుసునూర్‌ గ్రామ ముదిరాజ్‌ సంఘం అధ్యక్షుడు మహేశ్‌, మండల సంఘం నాయకుడు మాణిక్‌ తమ అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలయ్య, బసవరాజ్‌ పాటిల్‌, విఠల్‌, శివకుమార్‌ పాటిల్‌, బస్వరాజ్‌, శంకర్‌, సంగమేశ్వర్‌ పాటిల్‌, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌

కాంగ్రెస్‌ను నమ్మితే వందేళ్లు వెనక్కి

- తప్పుదారి పట్టించేందుకే ఆరు గ్యారంటీల ఏర
- బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చింతా ప్రభాకర్‌

సదాశివపేట(సంగారెడ్డి): కాంగ్రెస్‌ను నమ్మితే వందేళ్ల వెనక్కి పోతామని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ అన్నారు. పట్టణంలోని 5, 6, 7, 8, 21, 22, 23, 24 వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ పాలనలోనే ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే కాంగ్రెస్‌ ఆరు గ్యారంటీల హామీనిచ్చిందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్‌ కసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పిల్లోడి జయమ్మ, వైస్‌ చైర్మన్‌ చింతా గోపాల్‌, కౌన్సిలర్లు వడ్ల మహేశ్వరి, ఇంద్రమోహన్‌గౌడ్‌, కోఆప్షన్‌ మెంబర్‌ కోడూరి అంజయ్య, మాజీ కౌన్సిలర్లు సతాని శ్రీశైలం, అన్మిశెట్టి మల్లేశం, జిల్లాగౌడ సంఘం అధ్యక్షుడు పెద్దాగౌడ్‌, పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, పట్టణ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చింతా ప్రభాకర్‌



సదాశివపేట పట్టణంలోని 8వ వార్డులో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్‌

ఆరోపణలను నమ్మొద్దు

- తడ్కల్‌ను మండలంగా ఏర్పాటు చేస్తాం
- బీఆర్‌ఎస్‌ అభ్యర్థి భూపాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్‌): బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్‌ నాయకులు చేస్తున్న ఆరోపణలను నమ్మొద్దని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి భూపాల్‌రెడ్డి, ఆ పార్టీ సీనియర్‌ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తడ్కల్‌, ఘన్‌పూర్‌, తుర్కవడ్‌గాం, నాగుర్‌(కే), భీంరా, కంగ్టి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తడ్కల్‌లో మున్నూరు కాపు సంఘం, పద్మశాలి సంఘం సభ్యులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్‌, బీజేపీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ సహకారంతో తడ్కల్‌ మండలం ఏర్పాటు జీఓ విడుదల చేసినట్లు తెలిపారు. కానీ.. కాంగ్రెస్‌ నాయకులు మండలం ఏర్పాటు బూటకం అంటూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కోట ఆంజనేయులు, మనోహర్‌, సుభాన్‌రావు పాటిల్‌, సత్యనారాయణ, గోపాల్‌రావుపాటిల్‌, బాబుపటేల్‌ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి

కల్హేర్‌(నారాయణఖేడ్‌): బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటేయాలని ఆ పార్టీ అభ్యర్థి భూపాల్‌రెడ్డి కుమార్తె శ్రేయారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సిర్గాపూర్‌ మండల కేంద్రంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు సంజీవరావు పాల్గొన్నారు.



కల్హేర్‌: ప్రచారం నిర్వహిస్తున్న భూపాల్‌రెడ్డి కుమార్తె శ్రేయారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

పోస్టల్‌ బ్యాలెట్‌లో జాప్యం సరికాదు

గజ్వేల్‌రూరల్‌: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్‌ బ్యాలెట్‌లో జాప్యం సరికాదని టీఎస్‌యూటీఎఫ్‌ నాయకులు పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం గజ్వేల్‌లో వారు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫాం 12 దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, సిబ్బందికి శిక్షణ సమయంలో పోస్టల్‌ బ్యాలెట్‌ పొందేందుకు దరఖాస్తు పూర్తి చేసి తీసుకున్నట్లు తెలిపారు. కాగా మళ్లీ శిక్షణ కేంద్రాల్లో పోస్టల్‌ బ్యాలెట్‌ పంపిస్తామని అధికారులు చెప్పడం వల్ల ఎన్నికల సిబ్బంది అయోమయానికి గురవుతున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల ఉద్యోగులు సిద్దిపేట జిల్లాలో ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

సర్వే రిపోర్ట్స్‌తో కేసీఆర్‌ నారాజ్‌

ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్‌ తిలక్‌



మాట్లాడుతున్న క్రిస్టోఫర్‌ తిలక్‌

హుస్నాబాద్‌: అన్ని సర్వే రిపోర్ట్స్‌ కాంగ్రెస్‌ వైపే ఉన్నాయని తెలిసి సీఎం కేసీఆర్‌ నారాజ్‌గా ఉన్నారని ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్‌ తిలక్‌ అన్నారు. హుస్నాబాద్‌ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టోఫర్‌ తిలక్‌ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలోని చిన్న ముల్కనూర్‌ను దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్‌ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, హుస్నాబాద్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పిన మంత్రి హరీశ్‌రావు మాటలను ఏ ప్రాంత ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్‌ అభ్యర్థి, మాజీ పొన్నం ప్రభాకర్‌కు మద్దతుగా ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్‌ అధినేత్రి ప్రియాంక గాంధీ హుస్నాబాద్‌కు వస్తున్నట్లు వెల్లడించారు.పట్టణంలోని అమరుల స్థూపం వద్ద భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, సభకు దాదాపు 45 వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్‌ నియోజకవర్గ పరిశీలకులు గోపినాథ్‌ పళనియాప్పన్‌, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌ రావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES
■ష్యూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468
[W-7889 52]

OLD AGE HOME
■ఒమేగా హోంకేర్‌ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్‌. Ph: 8977639664/ 8977639665
[H-7936 53]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

టీఎన్‌జీఓ భవన శిలాఫలకం ధ్వంసం



- పోలీసులకు ఫిర్యాదు

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ ఐఓసీ భవనం ఎదుట ప్రభుత్వ భూమిలో టీఎన్‌జీఓ భవనానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. సెప్టెంబర్‌ 13న మంత్రి హరీశ్‌రావు ఐఓసీ భవనము ప్రారంభించిన రోజే టీఎన్‌జీఓ భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ భూమిని రియల్‌ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్‌లు చేసి విక్రయించారు. ప్లాట్‌లు కొనుగోలు చేసినవారు విక్రయించిన వారిపై ఒత్తిడి తేవడంతో అర్ధరాత్రి ఎవరూలేని సమయంలో శిలాఫలకమును ధ్వంసం చేశారని టీఎన్‌జీవో నాయకులు పోలీసులకు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకమునే ధ్వంసము చేసిన వారు రేపు కార్యాలయాల్లోని రికార్డులను మాయం చేయరనే నమ్మకము ఏందంటున్నారు. దోషులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని టీఎన్‌జీఓ సంఘము నాయకులు డిమాండ్‌ చేస్తున్నారు.

మహిళ హత్య

మనోహరాబాద్‌ (తూప్రాన్‌): పరిశ్రమలో పని చేయడానికి వచ్చిన మహిళ హత్యకు గురైంది. ఈ సంఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. కాళ్లకల్‌ గ్రామ శివారులో సర్వేనంబర్‌ 86లో గల గీతా ప్యానల్‌ ప్రొడక్ట్‌ పరిశ్రమ ఉంది. కాగా రెండేళ్ల క్రితం సూరజ్‌, రజనీదేవి చౌహాన్‌ (40) పరిశ్రమలో పని కోసం వచ్చారు. వారికి పని ఇచ్చి పరిశ్రమలోనే లేబర్‌ గదిని కేటాయించినట్లు పరిశ్రమ యజమాని ప్రవీణ్‌ పటేల్‌ తెలిపారు. కాగా ఈ నెల 19న సూరజ్‌ గదికి తాళం వేసి వెళ్లిపోయాడు.

కాగా బుధవారం గదిలో నుంచి దుర్వాసన రావడంతో కార్మికులు యజయాని ప్రవీణ్‌ పటేల్‌కు సమాచారమిచ్చారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పరిశ్రమ వద్దకు వచ్చి గది తలుపులు తీయగా కుళ్లిన స్థితిలో రజనీదేవి మృతదేహం కనిపించింది. దీంతో ఈమెను సూరజ్‌ హత్య చేసి వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆటలు అట్టహాసంగా..

- వర్గల్‌ గురుకులంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న మల్లయ్యభట్టు, తదితరులు



ఆటల పోటీల సందర్భంగా క్రీడాకారుల ఓత్‌ టేకింగ్‌ దృశ్యం

వర్గల్‌(గజ్వేల్‌): జ్యోతిబా పూలే బీసీ గురుకులాల బాలికల రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు తెరలేచింది. సిద్దిపేట జిల్లా వర్గల్‌ పూలే గురుకులం వేదికగా నాలుగు రోజులపాటు కొనసాగే ఈ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు ఆతిథ్య ఉమ్మడి మెదక్‌ జిల్లా నుంచి 1,000 మందికిపైగా క్రీడాకారులు వర్గల్‌ చేరుకోవడంతో పాఠశాల ప్రాంగణమంతా నిండుదనం సంతరించుకుంది. క్రీడాకారులు, విద్యార్థులు, ముఖ్యఅతిథులు, క్రీడాభిమానులతో గురుకుల ప్రాంగణం కిటకిటలాడింది. టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల సొసైటీ సెక్రటరీ మల్లయ్య భట్టు, ఐఎఫ్‌ఎస్‌ అధికారి శ్రీనివాస్‌ హాజరయ్యారు. వారికి మెదక్‌ ఆర్సీఓ ప్రభాకర్‌, ఆతిథ్య గురుకుల ప్రిన్సిపాల్స్‌ లక్ష్మీదేవి, భాస్కర్‌రావు బృందం విద్యార్థులతో కలిసి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి జిల్లాల వారీగా బాలికల మార్చ్‌ఫాస్ట్‌ కొనసాగింది. ముఖ్యఅతిథులు గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఓత్‌ టేకింగ్‌ కార్యక్రమాలు వరుసగా జరిగాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తొలిరోజు హోరాహోరీగా..

అండర్‌–19 విభాగంలో ఖమ్మం, కరీంనగర్‌ జట్ల మధ్య కబడ్డీ తొలి పోటీ జరిగింది. ఖమ్మం విజేతగా నిలిచింది. అదే విధంగా అండర్‌–19 వాలీబాల్‌ పోటీ రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల మధ్య జరగగా రంగారెడ్డి జిల్లా జట్టు గెలిచింది. పోటీల సందర్భంగా క్రీడాప్రాంగణం కేరింతలు, చప్పట్లతో హోరెత్తింది.